నేటి దినపత్రిక
# సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం | 03 నవంబర్ 2024 | పేజీలు 8

అమెరికాలో మంత్రి నారా లోకేష్‌కు వీడ్కోలు పలికిన

## ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



**జలదంకి, మేజర్‌న్యూస్ :** అమెరికాలోని న్యూయార్క్ విమానాశ్రయంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్‌కి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వీడ్కోలు పలికారు. గత 25న అమెరికా పర్యటనకు వెళ్లిన మంత్రి నారా లోకేష్ గురువారం పర్యటన విజయవంతమైంది. వివిధ కార్యక్రమాలతో పాటు మన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో విదేశీ సంస్థలను పెట్టుబడులు పెట్టేందుకు పరిశ్రమలను ఆహ్వానించారు. టీడీపీ వ్యవస్థాపకులు, దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహ ఆవిష్కరణ తదితర ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను, నారా లోకేష్ ప్రత్యేకంగా అభినందించారు.

బీద రవిచంద్రతో

## టూరిజం కార్పొరేషన్ చైర్మన్ భేటీ



**నెల్లూరు/నవాబుపేట, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రను మాగుంట లేఔట్‌లోని వారి నివాసంలో ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాలాజీని బీద రవిచంద్ర, జ్యోతి దంపతులు సన్మానించారు.

సూపర్ సిక్స్.. అమలు చేయని

## సూపర్ ఫ్లాప్ ప్రభుత్వం

- కోటిన్నర కుటుంబాలకు ఉచిత గ్యాస్ మొండిచేయితో మోసం
- తొక్కిపెట్టి నార తీయాల్సింది చంద్రబాబు, నారా లోకేష్‌కి
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా సూపర్ ఫ్లాప్ అయిందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి విమర్శించారు. శనివారం క్యాంప్ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కోటి 47 లక్షల రేషన్ కార్డులుంటే వాటిలో అరకోటి మందికి మొండిచేయి చూపుతూ పథకాన్ని ఎగ్గొట్టారని, మరోవైపు మిగిలిన వారు కూడా తొలుత డబ్బులు చెల్లించి గ్యాస్ కొనుగోలు చేస్తే, తర్వాత అకౌంట్లో వేయడం ప్రజలను మోసం చేయడమేనని ఆయన ధ్వజమెత్తారు. ఈ విధంగా కూటమి ప్రభుత్వం మరోసారి ప్రజలను దగా చేస్తోందని ఆయన దుయ్యబట్టారు. ఇంకా కూటమి పార్టీల్లో ఉన్న నేతల అవలక్షణాల గురించి సంస్కారం వీడి తాము మాట్లాడాల్సి వస్తే వారంతా తల ఎక్కడ పెట్టుకోవాలో తెలియక, తట్టుకోలేక అల్లాడాల్సిన దుస్థితి దాపురిస్తుందని, ఈ మేర రాజకీయ విమర్శలు చేసేటప్పుడు కాస్తా ముందూ, వెనుక వారి కుటుంబాల గురించి ఆలోచించుకుంటే బాగుంటుదని సీఎం, డిప్యూటీ సీఎంకు కాకాణి గోవర్ధన్‌రెడ్డి హితవు చెప్పారు. రాజకీయాల్లో ఉన్నాం కదా.. అని ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తూ, మా పార్టీ అధినేత వైఎస్ జగన్, ఆయన వ్యక్తిగత, కుటుంబ వ్యవహారాలపై పిచ్చి విమర్శలు తగవని, ఇక నుంచి మాట్లాడే ముందు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని, లేకపోతే ప్రజల్లో తలెత్తుకుని తిరిగే అవకాశం లేకుండా తాము కూడా మాట్లాడాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. రెండేళ్ల క్రితం విజయమ్మ ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైతే, అందులో కుట్రకోణం ఉందని టీడీపీ అఫీషియల్ సోషల్ మీడియా దుష్ప్రచారం చేయడం సిగ్గు చేటన్నారు. కూటమి పార్టీల నేతలు సంస్కారం తప్పి విమర్శలు చేస్తే, వాటికి తాము చేసే ప్రతి విమర్శలకు సమాధానం ఇచ్చుకోవాల్సి వస్తుందనే విషయాన్ని గ్రహించాలని స్పష్టం చేశారు. ఎన్టీఆర్‌ను ఎవరు చంపేశారు, ఆయన ఎవరి వల్ల చనిపోయారు ? ఆయన్ని శారీరకంగా, మానసికంగా హింసించడంతో పాటు, ఆయన స్థాపించిన పార్టీని, పార్టీ గుర్తును, పార్టీ బ్యాంక్ ఖాతాలను ఎవరు, ఎలా చేజిక్కించుకున్నారన్న ప్రశ్నలకు సమాధానం చెప్పగలరా ? అని నిలదీశారు. అలాగే ఎన్నికల ప్రచారం ముగించుకుని హైదరాబాద్ తిరిగి వస్తున్న జూనియర్ ఎన్టీఆర్ కారు ప్రమాదానికి గురైతే, అదికూడా కుట్ర అనుకోవాల్సి వస్తుందని, ఎందుకంటే భవిష్యత్తులో

-మిగతా 2లో

నెల్లూరు సిటీ నియోజకవర్గం కాంగ్రెస్ సమన్వయకర్తగా

## నారపరెడ్డి కిరణ్‌కుమార్ రెడ్డి



**నెల్లూరు/నవాబుపేట, మేజర్‌న్యూస్ :** నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి నియమించారు. ఈ సందర్భంగా ఆమెకు కిరణ్‌కుమార్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ.. నెల్లూరు సిటీ ఎప్పటి నుంచో కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని, తిరిగి కాంగ్రెస్ పార్టీ పునర్వైభవం కోసం కృషి చేస్తామని తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా కొనసాగుతూ.. గత ఎన్నికల్లో కోవూరు అసెంబ్లీ నియోజకవర్గం నుండి పోటీ చేసి, అనంతరం రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఎంపికై, ప్రస్తుతం నెల్లూరు సిటీ నియోజకవర్గం సమన్వయకర్తగా రావడం.. ఇలా కాంగ్రెస్ పార్టీలో ఒక్కోమెట్టు ఎక్కుతూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డికి అనుచరులు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ■ పరమ పవిత్రం కార్తీక మాసం..



కార్తీక మాసం ఈనెల 2వ తేదీ శనివారం నుండి ప్రారంభమైంది. హిందూ సంప్రదాయాల ప్రకారం కార్తీక మాసానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ మాసంలో హిందువులు భక్తి, శ్రద్ధలతో శివ, కేశవులిద్దరనీ ఆరాధిస్తుంటారు. అంతేకాకుండా కార్తీక మాసంలో ఎలాంటి మాంసాహారాలు ముట్టుకోకుండా నియమ నిష్టలు పాటిస్తూ.. దీపాలు వెలిగించడం వల్ల సకల పాపాలు తొలగిపోతాయని నమ్ముతారు. హిందువులు ఎంతో పవిత్రంగా భావించే కార్తీక మాసం,అన్ని మాసాలతో పోలిస్తే కార్తీక మాసం చాలా పవిత్రమెందని స్కంద పురాణంలో పేర్కొన్నారు.

వివరాలు 4లో



సీఎం రిలీఫ్ ఫండ్

## చెక్కును అందజేసిన కావలి ఎమ్మెల్యే

**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం ఎస్పీ పాలెం పంచాయతీ చెందిన రాజు రవి కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి రెడ్డి శనివారం సాయంత్రం సీఎం రిలీఫ్ ఫండ్ 95,600 రూపాయలు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బోగోలు మండలం మాలేపాటి నాగేశ్వరరావు, ఆదిశేషయ్య పాల్గొన్నారు.

సాగునీటి ఎన్నికలకు

## సర్వం సిద్ధం

నీటి పారుదల శాఖ ఎస్ఈ దేశానాయక్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** జిల్లాలో సాగు నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 10న నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని జిల్లా నీటిపారుదల శాఖ సూపరింటెంట్ ఇంజనీర్ దేశానాయక్, సోమశిల ప్రాజెక్ట్ సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం నెల్లూరు కలెక్టరేట్లో

2లో

# ఎస్సీ వర్గీకరణపై జాప్యం వీడాలి

## రౌండ్ టేబుల్ సమావేశంలో మాదిగ సంఘాల నేతల విమర్శ



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ఎస్సీ వర్గీకరణ పట్ల సుప్రీంకోర్టు సానుకూల తీర్పు ఇచ్చి నాలుగున్నర నెల గడుస్తున్న ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణలో నేటికీ జాప్యం చేస్తున్నారని వివిధ మాదిగ సంఘాల నేతలు విమర్శించారు. నెల్లూరు నగరంలోని అంబేద్కర్ భవన్లో మన ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్, ఏపీ ఎమ్మార్పీఎస్, మైనార్టీ బీసీ నేతల రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాల శ్రీనివాసులు మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో పోరాటాలు చేసి సుప్రీం కోర్టులో నేడు విజయవంతమయ్యామన్నారు. ఎస్సీ వర్గీకరణ పట్ల రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నాయని ధ్వజమెత్తారు. ఏబిసిడి వర్గీకరణతోనే మాదిగలకు భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదూరి రత్నం, ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు యాలపల్లి శ్రీనివాసులు, వేల్పుల రవి, పోలేపల్లి రమణారావు, మన ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కాకులూరు శ్రీనివాసులు, జిల్లా యూత్ అధ్యక్షుడు వన్నం కుమార్, ముట్లూరు శీనయ్య, పొదలకూరు మండల అధ్యక్షులు తాళ్లపాక ఏడుకొండలు, వెంకటాచలం మండల అధ్యక్షులు పట్టపు హరి, చిడతల పెంచలయ్య, మైనార్టీ నాయకులు ఎస్కే రియాజ్, చాంద్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

# నేడు బలిజ ప్రతిభా విద్యార్ధులకు ప్రోత్సాహకాలు

## అతిథిగా హాజరు కానున్న మంత్రి నారాయణ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలో ప్రతిభ చూపిన బలిజ విద్యార్థులకు ప్రోత్సాహక నగదు పారితోషికాలను అందజేయనున్నామని, ఈనెల 3వ తేదీన రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, బలిజకుల ఆణిముత్యం, విద్యార్థులకు స్ఫూర్తిప్రదాత డాక్టర్ పొంగూరు నారాయణ, రమాదేవి దంపతుల చేతుల మీదుగా పంపిణీ జరుగుతుందని కార్యక్రమ నిర్వాహకులు, రవిచెస్ట్ హాస్పిటల్ ఎండి డాక్టర్ పోకల రవి, ఆంధ్రప్రదేశ్ కాపు ఉపాధ్యాయుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కమతం సుబ్బారావు, జిల్లా కాపు ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు అనిల్ కుమార్ పేర్కొన్నారు. ఈనెల 3న నెల్లూరులోని ఇరుకళల పరమేశ్వరని అమ్మవారి ఆలయం సమీపంలోని బలిజభవన్ (కాపుభవన్) వద్ద పెద్దఎత్తున ఈ కార్యక్రమం నిర్వహించనున్నామని, 2023-24 విద్యాసంవత్సరంలో టెన్త్, ఇంటర్‌లలో ఉత్తీర్ణులై తల్లికానీ, తండ్రికానీ లేకుంటే 10 వేల రూపాయల వంతున అందజేస్తామన్నారు. టెన్త్‌లో 550, ఇంటర్మీడియట్‌లో 950మార్కులు సాధించిన ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివిన బలిజ విద్యార్థులకు 5వేల రూపాయల వంతున అందజేస్తామన్నారు. ప్రవేటు విద్యాసంస్థల్లో చదివిని వారికి 2500 రూపాయలు అందజేస్తామని వారు తెలిపారు. ఎంబిబిఎస్, ఐఐటి, ఐఐఐటి, ఎన్ఐటి సీట్లు సాధించిన బలిజ విద్యార్థులను సన్మానిస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రతిభ చూపిన, తల్లికానీ,తండ్రికానీ విద్యార్థులు ఫోన్‌ద్వారా నమోదు చేసుకోవాలని సుబ్బారావు వెల్లడించారు. కార్యక్రమానికి జిల్లాలోని బలిజలందరూ తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

# కందుకూరు జర్నలిస్టుల అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్షులుగా యర్రంశెట్టి ఆనందమోహన్
- ప్రధాన కార్యదర్శిగా ద్రోణాదుల చైతన్య
- కోశాధికారిగా డాక్టర్ చక్కాకేశవరావు ఏకగ్రీవం
- 27 మందితో కమిటీ ఎన్నిక



**కందుకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని స్వర్ణ ప్యాలస్‌లో కందుకూరు జర్నలిస్టుల అసోసియేషన్ (కేజేఏ) నూతన కమిటీని 27 మందితో ఏర్పాటు చేయటం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా యర్రమాల నాగభూషణం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గౌడ పేరు రాము, గౌరవ ముఖ్య సలహాదారులుగా డాక్టర్ పసుపులేటి పాపారావు, అధ్యక్షులుగా యర్రంశెట్టి ఆనందమోహన్, ఉపాధ్యక్షులుగా బొజ్జ చంద్రమోహన్ (కందుకూరు), కళ్యాణ్ (గుడ్లూరు), పర్రే ప్రసాద్ (ఉలవపాడు), ప్రధాన కార్యదర్శిగా ద్రోణాదుల చైతన్య ఆర్గనైజింగ్ సెక్రటరీగా కొండాబత్తిన కృష్ణ, సహాయ కార్యదర్సులుగా ద్రోణాదుల సురేష్ (కందుకూరు), సుధాకర్ (గుడ్లూరు), దాసరి శ్రీనివాసులు (ఉలవపాడు) కోశాధికారిగా డాక్టర్ చక్కా కేశవరావులతో పాటు మరో 15 మందితో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు యర్రంశెట్టి ఆనందమోహన్, ద్రోణాదుల చైతన్యలు మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన కందుకూరు జర్నలిస్టు అసోసియేషన్ సొంత ప్రయోజనాలకు తావివ్వకుండా కేవలం జర్నలిస్టుల సంక్షేమం కోసం పని చేస్తుందని వారు తెలిపారు. త్వరలోనే కందుకూరులో ప్రెస్ క్లబ్‌ను ఏర్పాటు చేయటం జరుగుతుందని వారన్నారు. కార్యక్రమంలో కందుకూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల విలేకరులు పాల్గొన్నారు.




## 68వ రాష్టస్థాయి క్రీడోత్సవాలు ప్రారంభం

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ 28వ డివిజన్‌లోని జిల్లాపరిషత్ స్కూలులో శనివారం 68వ రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ చెక్క అహల్య సాయి సునీల్, జిల్లా విద్యాశాఖ అధికారులు, సంబంధిత అధికారులు హాజరయ్యారు. చదువుతోపాటు క్రీడలు కూడా అవసరమని వక్తలు పేర్కొన్నారు.

**CHANGE OF NAME**

I, KOVI SREENIVASULU (Old Name) bearing Passport No.J4201998 resident of D.No. 3-5-54,2/A,Vijaya Behri Homes, Lakshmipuram, Settygunta Road,Nellore,SPSR Nellore Dt.(A.P) do hereby change my name as

**KOVI SRINIVASULU
S/o KOVI CHENCHAIAH
(New Name)**

## సాగునీటి ఎన్నికలకు సర్వం సిద్ధం



*(మొదటి పేజీ తరువాయి)*

తిక్కన ప్రాంగణంలో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించడానికి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నీటి పారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్‌లు మాట్లాడుతూ.. జిల్లాలో 490 నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులకు, 8 డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులకు, 7 ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌లకు ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలు నవంబర్ 20వ తేదీన నోటిఫికేషన్ జారీ చేయడం జరుగుతుందనీ. సాగునీటి సంఘాల అధ్యక్షులు ఎన్నిక నవంబర్ 21 నుండి 23 వరకు మూడు రోజులపాటు జరుగుతాయన్నారు. జిల్లాలో 490 సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించడానికి 980 మంది పోలింగ్ అధికారులను, 7,396 మంది పోలింగ్ సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. జిల్లాస్థాయిలో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు 37 మంది మాస్టర్ ట్రైనర్లుకు శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టర్ పూజ, నెల్లూరు రెవిన్యూ డివిజన్ అధికారి అనూష, కావలి రెవెన్యూ డివిజనల్ అధికారి వంశీ కృష్ణ, నీటిపారుదలశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

### సూపర్‌సిక్స్ అమలు చేయని..

## సూపర్ ఫ్లాప్ ప్రభుత్వం

*(మొదటి పేజీ తరువాయి)*

టీడీపీలో నారా లోకేష్‌కు ఎన్టీఆర్ అడ్డు వస్తాడన్న భయం వారిలో ఉందని మాజీ మంత్రి ప్రస్తావించారు. ఇంకా చెప్పాలంటే హరికృష్ణ, ఆయన కుమారుడు జానకిరామ్ మరణాల వెనకా.. కుట్ర కోణాన్ని ప్రస్తావించాల్సి వస్తుందన్న కాకాణి, మీ ఇంట్లో మహిళ ఆత్మహత్య చేసుకోవడం వెనుక కుట్ర ఉందని ప్రచారం చేస్తే ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. ఎప్పుడూ సంస్కారంతో ఆలోచించే జగన్, వ్యక్తిగత, కుటుంబ విమర్శలకు దిగరని చెప్పారు. చంద్రబాబు సహవాసంతో పవన్‌కళ్యాణ్ కూడా గతి తప్పి మాట్లాడుతున్నారన్న మాజీ మంత్రి, షర్మిలకు భద్రత కల్పించాల్సిన అవసరం ఆయనకు ఏముందని ప్రశ్నించారు. పవన్ కుటుంబం నుంచి గతంలో రోడ్డెక్కిన ఒక ఆడబిడ్డ, తనకు ఫ్యామిలీ నుంచి ప్రాణహాని ఉందంటూ బహిరంగంగా ప్రకటించిన విషయాన్ని గుర్తు చేసిన ఆయన, ఈ మాటలు మీకెంత బాధ కలిగిస్తాయో.. ఎదుటివారికీ అలాగే ఉంటుందన్న విషయం మరవొద్దని చెప్పారు. తొక్కిపెట్టి నార తీస్తా అంటూ.. పవన్ పెద్ద పెద్ద డైలాగ్‌లు చెబుతున్నారన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, అంతలా తొక్కి నార తీయాలనుకుంటే, ఇసుక, మద్యం మాఫియాలో మీ ఎమ్మెల్యేలు ఏయే నేరాలు, ఘోరాలు చేస్తున్నారో తెలుసుకుని, వారికి ఆ పని చేయాలని.. అలాగే ఇచ్చిన హామీలు అమలు చేయని సీఎం చంద్రబాబు, ఆయన కొడుకు లోకేష్‌ను తొక్కిపెట్టి నార తీయాలని సూచించారు.

## నేడు జిల్లా సమీక్ష మండలి సమావేశం

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

జిల్లా సమీక్ష మండలి సమావేశం (డిఆర్‌సి) జిల్లా ఇన్చార్జి మంత్రి ఎన్ఎండి. ఫరూక్ అధ్యక్షతన ఆదివారం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు పొదలకూరు రోడ్లోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగే జిల్లా సమీక్ష మండలి సమావేశానికి జిల్లా మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, ఎమ్మెల్యేలు, మండలి సభ్యులు పాల్గొంటారని, జిల్లా అధికారులందరూ తగిన సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

# ల్యాబ్ టెక్నీషియన్స్‌కి మాసాంతపు సమీక్షా సమావేశం




**నెల్లూరు/నవాబుపేట, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సమావేశ మందిరంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఎం.పెంచలయ్య జిల్లా క్షయ లెప్రసీ, ఎయిడ్స్ కంట్రోల్ ఆఫీసర్ ఎస్.కె ఖాదర్ వలీ జిల్లా సహాయ మలేరియా అధికారి వి.నాగార్జున రావు ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల ల్యాబ్ టెక్నీషియన్స్‌కి మాసాంతపు సమీక్ష సమావేశం నిర్వహించారు.సమావేశంలో డిఎంహెచ్వో డాక్టర్ ఎం.పెంచలయ్య మాట్లాడుతూ.. అందరూ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్స్ ఎఫ్ఆర్ఎస్ హాజరు సకాలంలో నమోదు చేయవలసిందిగా, సమయపాలన కచ్చితంగా పాటించి విధులను సక్రమంగా నిర్వర్తించ వలసినదిగా అలా ఎఫ్ఆర్ఎస్‌లో నమోదు చేయని వారికి జీతాలు తగ్గించటం జరుగుతుందని తెలియజేశారు. ల్యాబ్ టెక్నీషియన్లందరూ ల్యాబ్ లో పరీక్షలను మంచిగా నిర్వహించి సరియైన ఫలితాలను అందజేయవలసినదిగా తెలియజేశారు. అనం తరం డాక్టర్ ఎస్.కె ఖాదర్ వలీ మాట్లాడుతూ.. క్షయ వ్యాధికి సంబంధించిన కళ్ళే పరీక్షలను తగిన ప్రమాణాలతో నిర్వహించి నిర్దేశిత లక్ష్యాలను సాధించవలసిన.. అన్ని అనుమానిత క్షయ వ్యాధిగ్రస్తులను పరీక్షించి సరియైన ఫలితాలను అందించవలసిన, వాటికి సంబంధించిన వివరాలను యాప్స్‌లో పొందుపరిచ వలయునని తెలియజేశారు. అనంతరం సహాయ మలేరియా అధికారి వి.నాగార్జునరావు మాట్లాడుతూ.. మలేరియా యాక్టివ్, పాసివ్ రక్త పరీక్షల నమూనాలను నిర్దేశిత లక్ష్యాల ప్రకారం 100 శాతం పూర్తి చేయవలసిందిగా తెలియజేశారు. ఈ సీజన్లో జ్వరపీడితులు ఎక్కువగా నమోదవుతున్న కారణంగా అందరికీ సకాలంలో రక్త పరీక్షలను నిర్వహించి వాటి యొక్క సక్రమమైన ఫలితాలను అందించి మలేరియా, డెంగ్యూ వ్యాధుల ఫలితాలను తొందరగా గుర్తించి తగిన చికిత్స అందజేసి వ్యాధులు ప్రబలకుండా చేయుటకు దోహదపడవలసినగా తెలియజేసినారు, అలాగే వారాంతపు, మాసాంతపు రిపోర్టులను సకాలంలో జిల్లా కార్యాలయానికి అందజేయాలని సూచించారు. ఈ సమావేశానికి జిల్లాలోని అందరు ల్యాబ్ టెక్నీషియన్స్‌ను క్షయ వ్యాధి నిర్మూలన సిబ్బంది, మలేరియా నిర్మూలన కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా మాతాపరమేశ్వరి విగ్రహప్రతిష్ట

● 50వేల విరాళం ఇచ్చిన 'కంచి' ● పూజల్లో కంచి దంపతులు ● కంచి విరాళంతో అన్నదానం





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం రావులకొల్లులో శ్రీ మాతా పరమేశ్వరి ఆలయాన్ని నిర్మించి శ్రీ మాతాపరమేశ్వరి, శ్రీపోతురాజుల విగ్రహాలను శనివారం వేదమంత్రాలతో అర్చకుల పర్యవేక్షణలో ప్రతిష్టించారు. ఈ కార్యక్రమంలో నిత్యాన్నదాత, శ్రీసాంబశివ చారిటబుల్‌ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి దంపతులు పాల్గొన్నారు. వారు పూజి కార్యక్రమాల్లో పాల్గొనడంతోపాటు ఆలయ అభివృద్ధికి తమ ట్రస్ట్ ద్వారా 50వేల రూపాయల విరాళం అందజేశారు. ఆయన విరాళంతో అన్నదాన కార్యక్రమంపెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంచి దంపతులు పాల్గొనాలని, అన్నప్రసాదవితరణ కార్యక్రమంకు చేయూతనివ్వాలని ఆలయ నిర్వాహకులు వారిని ఆహ్వానించారు. దంతో కంచి దంపతులు పాల్గొనడంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ అభివృద్ధికి 50వేలరూపాయల విరాళం కూడా అందజేశారు. పూజల్లో పాల్గొన్ని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించిన కంచి దంపతులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామిరెడ్డి ఉషారాణి, మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రామిరెడ్డి మోహన్‌రెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## మెప్మా ఆర్ సి లకు శిక్షణా కార్యక్రమం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరం నందు శనివారం ఎస్‌హెచ్‌జి ప్రొఫైలింగ్ అప్లికేషన్‌పై మెప్మా ఆర్‌పీలకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంకు సంబంధించి అన్నీ అంశాలను గురించి వివరించి అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానిరి మెప్మా ప్రాజక్ట్ డైరక్టర్ రవీంద్ర, మున్సిపల్ కమీషనర్ గంగా ప్రసాద్, ఆత్మకూరు మెప్మా టీఎంసీ జి.మాధవి, టిఈఐబి అంకయ్య, సోషల్ సెక్యూరిటీ హెల్త్, న్యూట్రిషన్ కాంతయ్య, మెప్మా ఎల్‌హెచ్ సుధాకర్, ఐటీ యాంకర్ శంకర ప్రసాద్, బుచ్చి రెడ్డి పాలెం మెప్మా సీఓ నర్మదా, మెప్మా ఆర్‌పీలు అందరూ పాల్గొన్నారు.



## ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో క్లీనర్ మృతి



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** విహారి ప్రైవేటు ట్రావెల్స్ బస్సు క్లీనర్‌గా పనిచేస్తున్న ఆత్మకూరు నియోజకవర్గం ముస్తాపురం గ్రామానికి చెందిన గడ్డం రమేష్ (30) అనే వ్యక్తి హైదరాబాదు నుంచి ఏఎస్ పేటకు వస్తు మార్గమధ్యలో అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది ఈ మేరకు మృతుడు రమేష్ భార్య అనూష ఫిర్యాదు మేరకు ఏఎస్పేట పోలీసులు కేసు నమోదు చేశారు అనంతర రమేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు పేర్కొన్నారు భార్య పిల్లలు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

## బిక్షాటన డ్రైవ్‌లో పట్టుబడ్డ బాలలని చిల్డ్రన్స్‌హెూమ్‌కు తరలింపు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా స్త్రీ, శిశు అభివృధి సాధికారిత అధికారిణి నెల్లూరు జిల్లా కార్యాలయంలో బిక్షాటన డ్రైవ్‌లో పట్టుబడ్డ బాలలని చిల్డ్రనహెూమ్ నెల్లూరులో ఉంచడం జరిగింది. ఆ బాలికలకు శనివారం జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సాధికారితా అధికారిణి బి.హేనసుజున్ చేతులు మీదుగా దుస్తులు ఇవ్వడం జరిగింది. ఈ దుస్తులు తీసుకున్న బాలికలు చాలా సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## విద్యా ఉల్లాస్ శిక్షణా కార్యక్రమం




**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో విద్య ఉల్లాస్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 15 సంవత్సరాలకు మించి 60 సంవత్సరాల వయసు వరకు పొదుపు సంఘాలలో సభ్యులుగా వున్న నిరక్షరాస్యులను గుర్తించి, వారికి ఆరు నెలల పాటు వయోజన విద్య పథకం క్రింద చదవడం, రాయడం నేర్పించడం జరుగుతుందన్నారు. మొదటి విడతగా మండలంలో 44 గ్రామాల్లో 696 మంది నిరక్షరాస్యులకు 71 మంది విద్యా వాలంటీర్ల ద్వారా రోజుకు రెండు గంటలు చదువు చెప్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ మహ్మద్ ఆజాద్, ఎంపీడీఓ నరసింహారావు, ఏపీఎం చిన్నయ్య, ఎంఈఓ రేణుక, ఐసిడిఎస్ సూపర్వైజర్ జ్యోతి లక్ష్మీ, వెలుగు సీసీలు, విఏఓలు హాజరయ్యారు.

## సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వివిధ వ్యాధులతో పలు వైద్యశాలలో చికిత్స పొంది ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి సహాయం కోరిన 22మంది లబ్ధిదారులకు రూ.22,04,734 వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైనాయి. లబ్ధిదారులు శనివారం ఎమ్మెల్యే ద్వారా చెక్కులను అందుకున్నారు. అనంతరం శాసనసభలో మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైద్యానికి పెద్దపీట వేస్తున్నారని అభివృద్ధిలో రాష్ట్రం ముందుందని అలాగే ప్రతి పేదవానికి రాష్ట్రం ప్రభుత్వం అందించే పలు పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# బుడంగుంటలో రోడ్డు మరమ్మత్తులకు శంకుస్థాప



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో మున్సిపల్ 17వ వార్డులో శనివారం బుడంగుంట గ్రామంలో వర్షాల వలన, గత ఐదు సంవత్సరాల కాలంలో మరమ్మత్తులకు గురైన రోడ్లు కూడా పట్టించుకోని పరిస్థితులు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కావలి పట్టణంలో రోజు రోజుకి అభివృద్ధి పనులు వేగవంతమైన చెప్పవచ్చు గత ఐదు సంవత్సరాల నుంచి ప్రస్తుతం ఇప్పటివరకు ప్రభుత్వం పనితీరు అభివృద్ధి ఎలా ఉందో ఒకసారి మనం గమనించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన మహిళలకు సూపర్ సిక్స్ పథకాలు దీపం-2 పథకాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించడం జరిగింది. అలాగే శనివారం బుడమగుంట నుండి చౌదరి పాలెం పోయే రోడ్లు సరిగా లేనందు వల్ల మరమ్మత్తులకు శంకుస్థాపన నిర్వహించారు. అనంతరం వర్షాలు తగ్గిన తర్వాత పూర్తిగా రోడ్డు మరమ్మత్తులు కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం గ్రామంలోని ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని దేవత అంకమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని కూటమికి ప్రజలు మద్దతు తెలుపుతున్నారన్నారు. రోడ్లు, భవనాల శాఖకు సంబంధించిన గ్రామాలను అనుసంధానం చేసి అంతర్గత రోడ్లు మరమ్మత్తులు పూర్తి చేస్తామని తెలిపారు. అలాగే రైతాంగానికి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని పారిశ్రామిక అభివృద్ధి లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గ్రామం నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం విజయవంతం




**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** జనసేన పార్టీ అధ్యక్షులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రతిష్టాత్మంగా ప్రారంబించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక జనవాణి కార్యక్రమం ఎంతో విజయవంతమైంది. ఏపీ టిడ్కో చైర్మన్ జిల్లా పర్యవేక్షకులు వేములపాటి అజయ్ సూచనలతో నెల్లూరు జిల్లాలో గోమతి నగర్ ఆఫీస్ నందు జనవాణి కార్యక్రమం ప్రారంభించారు. పిష్ పాండింగ్ లోన్‌కు అప్లై చేసి, లోన్ విషయంలో ఇబ్బంది గురైన బాధిత మహిళ జానవాణి కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్‌కి ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. గునుకుల కిషోర్ బ్యాంక్ మేనేజర్ని బ్యాంకు సిబ్బందిని సంప్రదించగా ఎవరు అందుబాటులోకి రాలేదని తెలిపారు. అగ్రికల్చర్ బీఎస్సీ చేసి స్వయం ఉపాధి కింద పెట్టుకున్న లోన్లు జాప్యం చేయడం ఎంతవరకు న్యాయం అని ప్రశ్నించారు. మహిళ ఇబ్బందిని కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్ళి అధికారులతో, జనసేన సీనియర్ నాయకులతో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గురుకుల కిషోర్, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి వెంకట్రావు, సూళ్లూరు పేట నియోజకవర్గం ఐటి కోఆర్డినేటర్ తులసి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దండి

▶ ఉల్లాస్‌పై శిక్షణ : ఎంపీడీవో ప్రసన్నకుమారి




**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండలంలోని 18 సంవత్సరాలు దాటిన నిరక్షరాస్యులను గుర్తించి విద్య నేర్పించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఏఎస్పేట మండల ఎంపీడీవో ప్రసన్నకుమారి ఎంఈఓ డి.సాయి ప్రసాద్‌లు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన ఏఎస్పేటలోని వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ (సమాజంలోని అందరికీ జీవితకాల అభ్యాసన పై అవగాహన) కార్యక్రమం పై మండలంలోని విఓఏ (గ్రామ ఆర్గనైజేషన్ సహాయకులు)కు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రసన్న కుమారి ఎంఈఓ డి.సాయి ప్రసాద్‌లు మాట్లాడుతూ.. మండలంలో అన్ని గ్రామాల్లో తొలి విడతగా 380 మందిని గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం మూడు సంవత్సరాలు జరుగుతుందని తెలిపారు. ప్రతిరోజు వివోఏలు సాయంత్రం ఐదు గంటల నుండి ఏడు గంటల వరకు తరగతులు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సతీష్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు విజయలక్ష్మి కస్తూరి సీసీలు వివోఏలు పాల్గొన్నారు.

## మృత్యుంజయకు ఏఈగా పదోన్నతి



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** గృహ నిర్మాణ శాఖలో వర్క్ ఇన్స్‌పెక్టర్‌గా పని చేస్తున్న మృత్యుంజయకు రాష్ట్ర ప్రభుత్వం ప్రమోషన్ కల్పించింది. ఈ మేరకు ఆయన గృహ నిర్మాణ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్‌గా పదోన్నతి పొందినారు. ఈ నేపథ్యంలో శనివారం ఈ విషయాన్ని **మేజర్ న్యూస్**కు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సహకారంతో గృహ నిర్మాణ శాఖలో పేదలకు న్యాయం చేస్తామన్నారు. పదోన్నతి కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. పక్కా గృహాలు నిర్మాణ పనులు వేగవంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# పరమ పవిత్రం కార్తీక మాసం..



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** కార్తీక మాసం నవంబర్ 02 నుండి ప్రారంభమవుతుంది. హిందూ సంప్రదాయాల ప్రకారం కార్తీక మాసానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ మాసంలో హిందువులు భక్తి, శ్రద్ధలతో శివకేశవులిద్దరనీ ఆరాధిస్తుంటారు. అంతే కాకుండా కార్తీక మాసంలోనూ ఎలాంటి మాంసాహారాలు ముట్టుకోకుండా నియమ నిష్టలు పాటిస్తూ దీపాలు వెలిగించడం వల్ల సకల పాపాలు తొలగిపోతా యని నమ్ముతారు. హిందువులు ఎంతో పవిత్రంగా భావించే కార్తీక మాసం, అన్ని మాసాలతో పోలిస్తే కార్తీక మాసం చాలా పవిత్రమైనదని స్కాంద పురాణంలో పేర్కొన్నారు. ఇది అత్యంత మహిమాన్వితమైన మాసం. పూజలు, వ్రతాలు, ఉపవాసాలు, వనభోజనాలతో మాసమంతా భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోతారు.

▶ కార్తీక మాసమంతా ఒంటిపూట భోజనం చేసే వారుంటారు. సోమవారాలు, కార్తీక పౌర్ణమికి మాత్రం ఉపవాసం చేసే వారుంటారు, ఏకాదశి తిథులలో ఉపవాసం చేసే వారుంటారు. ఏది ఏమైనా ఉపవాసం భక్తుని భగవంతుని దగ్గరగా తీసుకెళ్తుంది. అందుకే ఉపవాసానికి అంతటి విశిష్టత ఉంది.

▶ కార్తీక మాసంలో చేసే దీపారాధన చాలా మహిమ కలిగినదని చెబుతుంటారు. సాయంత్రం వేళ భక్తులు గుడిలో దీపారాధన చేస్తారు. ఇలా చేయడం వల్ల జన్మ జన్మల పాపాలు తొలగిపోతాయని భక్తులు విశ్వసిస్తారు. కొంతమంది కార్తీక పౌర్ణమి రోజు 365 ఒత్తులతో దీపం వెలిగించి శివుడిని దర్శించుకుంటారు.

▶ ఉసిరి చెట్టును విష్ణుమూర్తి స్వరూపంగా భావిస్తారు. అందుకే విష్ణువుని పూజించటంలో భాగంగా ఉసిరి చెట్టుకు పూజాదికాలు నిర్వహిస్తారని చెబుతున్నారు. ఇక ఇదే సమయంలో విష్ణు స్వరూపంగా భావించే ఉసిరి చెట్టు నుండి వచ్చిన ఫలాలపై దీపాలను పెట్టి వాటిని దానం ఇవ్వడం వల్ల విశేషమైన ఫలితాలు వస్తాయని, విష్ణుమూర్తి కరుణ తమపై ఉంటుందని భక్తులు విశేషంగా భావిస్తారు. అందుకే కార్తీకమాసంలో ఉసిరిక దీపాలను పెడుతూ ఉంటారు.

▶ బ్రహ్మముహూర్తంలో కార్తీక స్నానం, కార్తీక దీపం వెలిగిస్తారు. అయితే ఈ ఏడాది 2024 నవంబర్ 2న ప్రారంభం అయి నవంబర్ 1న పాడ్యమి ఘడియలు వచ్చినప్పటికీ సూర్యోదయ సమయంలో అమావాస్య ఘడియలు ఉన్నందున నవంబర్ 2 నుంచి కార్తీక స్నానాలు ప్రారంభించాలని పండితులు చెబుతున్నారు.



### కార్తీక మాసం నవంబర్ 02 శనివారం నుండి ప్రారంభమవుతుంది

నవంబర్ 03 : -యమవిదియ-భగినీహస్త భోజనం
నవంబర్ 04 : మొదటి కార్తీక సోమవారం
నవంబర్ 05 : మంగళవారం-నాగుల చవితి
నవంబర్ 06 : బుధవారం-నాగపంచమి
నవంబర్ 11 : రెండవ కార్తీక సోమవారం
నవంబర్ 12 : మంగళవారం-ఏకాదశి (మాతత్రయ ఏకాదశి అంటారు)
నవంబర్ 13 : బుధవారం- క్షీరాబ్ధి ద్వాదశి దీపం
నవంబర్ 15 : కార్తీకపూర్ణిమ, జ్వాలాతోరణం (365 వత్తులతో దీపాలు వెలిగిస్తారు)
నవంబర్ 18 : మూడో సోమవారం కార్తీకమాసం
నవంబర్ 19 : మంగళవారం-సంకటహర చతుర్థి
నవంబర్ 25 : నాల్గవ సోమవారం కార్తీకమాసం
నవంబర్ 26 : కార్తీక బహుళ ఏకాదశి
నవంబర్ 29 : కార్తీక మాసంలో శివరాత్రి
డిసెంబర్ 01 : ఆదివారం-కార్తీక అమావాస్య

# వీఎస్‌యూలో విజిలెన్స్ అవగాహన వారోత్సవం

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని శ్రీ పొట్టి శ్రీరాములు భవనంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవం సందర్భంగా అవినీతి నిర్మూలనపై అవగాహన పెంపొందించడానికి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్.విజయ భాస్కర్ రావు ముఖ్యఅతిథిగా, విశిష్ట అతిథిగా రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, గౌరవ అతిథిగా డిప్యూటీ సూపరింటెంట్ ఆఫ్ పోలీస్ "అన్తి-కోరుప్షన్ బ్యూరో" ఎస్.శిరీష హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ.. అవినీతి వ్యతిరేక పోరాటంలో ప్రజల భాగస్వామ్యం, అవగాహన ఎంతో ముఖ్య మని చెప్పారు. ప్రతి ఒక్కరు సత్య నిష్ఠతో ఉండి అవినీతి నిర్మూలనలో భాగస్వామ్యం కావాలని, విద్యార్థులు తమ జీవితాల్లో నిజాయితీ, సమర్థతను ప్రదర్శించాలని ఆయన సూచిం చారు. ఆయన యువత సామాజిక బాధ్యతను గుర్తించి, అవినీతి నివారణలో కీలక పాత్ర పోషించాలని ప్రేరణ కల్పించారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ.. అవినీతి నిర్మూలనకు




సంబంధించిన అవగాహన విద్యార్థులకు అవసరమని, సమాజంలో నిజాయితీ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం గౌరవ అతిథిగా పాల్గొన్న డిప్యూటీ సూపరిం డెంట్ ఆఫ్ పోలీస్ "అన్తి-కోరుప్షన్ బ్యూరో" ఎస్.శిరీష, అవినీతి నిర్మూలనలో ప్రతి పౌరుడి బాధ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతా యుతంగా వ్యవహరిస్తూ అవినీతిని వ్యతిరేకిం చాలన్నారు. అవినీతి నిర్మూలనకు సాంకేతికత, నూతన పద్ధతులను వినియోగించడం ముఖ్యమని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులుగా విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్. విజయ, కోఆర్డినేటర్‌గా డాక్టర్ ఎస్‌బీ సాయినాథ్, డాక్టర్ సీఎస్ సాయి ప్రసాద్‌రెడ్డి డిప్యూటీ రిజిస్ట్రార్, డాక్టర్ సుజయ్ కుమార్ సహాయక రిజిస్ట్రార్, విజిలెన్స్ సిబ్బంది సీఐ ఎం.విజయకుమార్, సీఐ ఆంజనేయరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

# రహదారులతో గ్రామాలకు మహర్దశ : ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు, మేజర్‌న్యూస్ :** గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమానికి ముఖ్యఅథితిగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరయ్యారు. గుంతల రహిత కందుకూరు నియోజకవర్గం నా లక్ష్యం అని, రహదారుల అభివృద్ధితోనే గ్రామాల అభివృద్ధి ముడిపడి ఉందని అందుకు అనుగుణంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే తెలియజేశారు. లింగసముద్రం మండలం మేదరమెట్ల పాలెం పంచాయితీలోని బస్సు షెల్టర్ వద్ద నుంచి పెదపవని గ్రామానికి వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు మరమ్మత్తుల కార్యక్రమానికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి మేదరమిట్లపాలెం గ్రామ ప్రజలు, టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రజలు విశ్వసించి కూటమి ప్రభుత్వాన్ని ప్రజల గెలిపించుకున్నారని, వారి నమ్మకాన్ని నిలబెడుతూ గెలిచిన 100 రోజులలో అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందించి వారి నమ్మకాన్ని నిలబెట్టుకున్నామని ఎమ్మెల్యే తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు లేక ఎక్కడికి అక్కడ రోడ్లన్నీ గుంతల మయమయ్యాయని, రహదారులపై ప్రయాణం చేయాలంటే ప్రజలు నరకం చూశారని ఎమ్మెల్యే ఆరోపించారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సంక్రాంతి పండుగ నాటికి గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యంగా కందుకూరు నియోజకవర్గంలో గుంతల రహిత కందుకూరును ప్రజలు త్వరలో చూడబోతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కూరపాటి భాస్కర్, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ ప్రసాద్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చక్రధర్, గ్రామ సర్పంచ్ కూరపాటి మాధవి, పార్టీ నాయకులు కూరపాటి శీను, రమేష్, షేక్ నాయబ్ రసూల్, గొర్రెపాటి సాంబయ్య, సోంపల్లి మనోహర్, అన్ని గ్రామ పార్టీ అధ్యక్షులు అనుబంధ సంఘాల సభ్యులు టిడిపి బిజెపి జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనుమసముద్రంలో పొలంబడి కార్యక్రమం



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండలంలోని అనుమసముద్రం గ్రామంలోని సచివాలయంలో పొలంబడి పై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి ఈ శైలజా కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు మేలైన వ్యవసాయ సాగు పద్ధతులు పొలంబడిపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు పచ్చిరొట్ట ప్రయోజనాలు విత్తన శుద్ధి రవికి అనువైన వరి రకాలు నాటు సమయం సమగ్ర ఎరువుల యాజమాన్యం నీటి యాజమాన్యం సమగ్ర సస్యరక్షణ పద్ధతులు అతి తక్కువ పెట్టుబడితో నికరమైన అధిక నాణ్యమైన దిగుబడిని సాధించు విధానాలు తెలియజేశారు. ఏఎస్పేట మండల వ్యవసాయ అధికారి రజిని మాట్లాడుతూ.. జీవన ఎరువులు మిత్ర పురుగుల సంరక్షణ వంటి యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ చిరంజీవి వీఏఏలు జి.రమ, కే.శ్రీహరి రైతులు పాల్గొన్నారు.

## అబ్దుల్ మస్తాన్ త్వరగా కోలుకోవాలి : ఎమ్మెల్సీ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** అనారోగ్యంతో ఉండి శస్త్ర చికిత్స అనంతరం ఇంటికి వచ్చిన 42వ డివిజన్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ అబ్దుల్ మస్తాన్ నివాసానికి వెళ్లి శనివారం వైసిపి ఎమ్మెల్సీ, ఇన్‌చార్జ్ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల గుండె సంబంధిత అనారోగ్యానికి గురై మెరుగైన చికిత్స తీసుకొని ఇంటికి చేరుకున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అబ్దుల్ మస్తాన్ త్వరగా కోలుకొని ఆరోగ్యంగా తిరిగి యధాస్థితిలో పార్టీ కార్యక్రమాలకు పాల్గొనాలని కోరారు. ఆరోగ్య పరిస్థితి గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. అబ్దుల్ మస్తాన్ త్వరగా కోలుకోవాలని, తనకు పూర్తి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి వెంట వైసీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్ స్థానిక కార్పొరేటర్ కరిముల్లా, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేని కలిసిన హెూటల్స్ అసోసియేషన్ సభ్యులు



**కందుకూరు, మేజర్‌న్యూస్ :** కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పట్టణంలోని హెూటల్స్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావుని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, కందుకూరు సీఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# సేవే పరమావధిగా సామాజిక పింఛన్ అందజేత

**జలదంకి, మేజర్‌న్యూస్ :** మొక్కుబడిగా ఉద్యోగం చేసామా.. ఇంటికి వెళ్ళామా అన్నట్లు కాకుండా సేవే పరమావధిగా అందరి మన్ననలు పొందుతూ సమాజ సేవకు అసలైనని నిర్వచనం చూపిన జమ్మలపాలెం వెల్ఫేర్ అసిస్టెంట్ అంకయ్య ఆ సచివాలయం పరిధిలో అందరి మన్ననలు పొందుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటికి చేరడంతోపాటు తన పరిధిలో ఉండే ప్రజలకు అండగా ఉంటున్నారు. వృద్ధులకు, వికలాంగులకు ఉదయాన్నే చిరునవ్వుతో పింఛన్ అందిస్తూ సేవకు నిజమైన అర్థంచెబుతున్నారు. ఆప్యాయంగా మాటలు కలుపుతారు. అవ్వ, తాత, అన్న అంటూ ఇంటింటికి వెళ్లి ఉదయాన్నే పింఛన్ ఇస్తారు. అనారోగ్యం కారణాలతో కూతుర్ల దగ్గర, కొడుకు దగ్గరో ఉంటున్న వృద్ధులకు సైతం వారి ఊరికి వెళ్లి పింఛన్ అందిస్తున్నారు. జమ్మలపాలానికి చెందిన మహిళ రేగటచెలిక గ్రామంలో అనారోగ్యంతో ఉండగా తన కూతురి ఇంటి దగ్గర ఉన్న ఆ మహిళకు ఆ గ్రామానికి వెళ్లి పెన్షన్ అందజేసి మేమున్నామని భరోసా ఇచ్చారు. అనారోగ్యంతో హాస్పిటల్, దూర ప్రాంతాల్లో వృద్ధులు ఉన్న స్వంత ఖర్చుతో అక్కడికి వెళ్లి వారికి పింఛన్ అందిస్తూ వృద్ధుల ఆశీస్సులు పొందుతున్నారు. ఇది తెలుసుకున్న కూటమి నాయకులు వెల్ఫేర్ అసిస్టెంట్ సేవలను కొనియాడారు.



# ట్రూ అప్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి

- ఇళ్లకు స్మార్ట్ మీటర్లు పెట్టడాన్ని వెనక్కు తీసుకోవాలని కోరుతూ సీపీఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ
- నెల్లూరు రూరల్ విద్యుత్ శాఖ సబ్ స్టేషన్‌లపై అధికారులు పర్యవేక్షణ లోపం
- ప్రైవేటు వ్యక్తులకు ఆదాయం చేకూరుస్తున్న విద్యుత్ శాఖ




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** సీపీఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్ మోపూరు సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు మండల కార్యదర్శి పూడిపర్తి జనార్ధన్‌లు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలందరూ గతంలో ఎప్పుడో వాడుకున్నటు వంటి విద్యుత్ చార్జీలను, ట్రూ అప్ చార్జీల భారాలను ప్రజలపై వెయ్య బోమని, ఎన్నికలలో వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత, ట్రూ అప్ చార్జీల పేరుతో వేలకోట్లు రూపాయలు ప్రజలపై భారాలు మోపడమే గాక, నివాసముంటున్న ఇళ్లకు కూడా స్మార్ట్ మీటర్లు బిగించడం అన్యాయమని, అసలే నిత్యావసర సరుకుల ధరలు పెట్రోలు డీజిల్ ధరలు పెరిగిపోయి వున్న తరుణంలో ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని చార్జీలను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని, స్మార్ట్ మీటర్లు పెట్టే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అన్నారు. గతంలో వైఎస్ఆర్ ప్రభుత్వం రైతుల వ్యవసాయ పంపుసెట్లకు ఇచ్చే విద్యుత్తును 9 గంటల నుంచి ఏడు గంటలకు కుదించారని, నేడు కూటమి ప్రభుత్వం 9 గంటల విద్యుత్తు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నెల్లూరు మండల కమిటీ సభ్యులు. ఎంవి రమణ, శ్రీపతి వెంకయ్య, జానా లక్ష్మీ ప్రసాదు, బాలు ఆదిశేషయ్య, పాదర్తి మస్తాన య్య, పర్చూరు ప్రభాకర్, మరిమేసి కామాక్షయ్య, శ్రీపతి దయాకర్, పేరత్తూరు నాగరాజు, పాదర్తి మస్తాన్, పాదర్తి మల్లికార్జున, పోలేపల్లి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

# అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**కందుకూరు, మేజర్‌న్యూస్ :** కందుకూరు పట్టణంలోని కనిగిరి రోడ్లో శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా మాల ధారణ స్వాములకు ఏర్పాటుచేసే అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ముందుగా శ్రీ అయ్యప్ప స్వామి సేవా సంఘం సభ్యులు ఎమ్మెల్యే నాగేశ్వరరావుకి స్వాగతం పలికారు. అనంతరం శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు, వేద ఆశీర్వచనం, స్వామి వారి శేష వస్త్రాన్ని అందజేశారు. ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అయ్యప్ప స్వాముల అన్న ప్రసాద భవనాన్ని ఎమ్మెల్యే నాగేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గత 18 సంవత్సరాల నుంచి కార్తీకమాసంలో మాల ధారణ స్వాములకు అన్న ప్రసాదం ఎంతో మంచి కార్యక్రమమని అన్నారు. శ్రీ అయ్యప్పస్వామి అనుగ్రహం కమిటీ సభ్యులకు దాతలకు ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ అయ్యప్ప స్వామి సేవా సంఘం సభ్యులు, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# నిరక్షరాస్యత నిర్మూలనకు శిక్షణ కార్యక్రమం




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో వెలుగు కార్యాలయంలో శనివారం కావలి మండల సమాఖ్య నిరక్షరాస్యత నిర్మూలనకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 43 గ్రామ సంఘముల నుండి ఇద్దరు చొప్పున స్వచ్ఛందంగా ట్రైనింగ్ డెమో గుర్తించి వారికి ఈ కార్యక్రమంలో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమానికి కావలి మండల విద్యాశాఖ అధికారి గోవిందయ్య ఐసిడిఎస్, సిడిపిఓ సౌజన్య సూపర్వైజర్లు ఏ.విజయలక్ష్మి, ఎం.కృపమ్మ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఏపిఎం పి.వి.కృష్ణ ఆధ్వర్యంలో సిసిలు ఎస్కే రసూల్, శివయ్య, చిరంజీవి, ఎం.మాల్యాద్రి ఆర్థిక అక్షరాస్యత పై, డిజిటల్ అక్షరాస్యతను గురించి న్యాయ సలహాలు, మరియు సందేహాలు, చట్టాల పైన వివిధ సంస్థలకు సంబంధించిన మహిళల గురించి అందించే సేవా కార్యక్రమాల పై, అక్షరాస్యత సంబంధించిన పాఠ్యాంశాల పైన వారికి శిక్షణ ఇచ్చారు. అలాగే కే.సుమతి మండల సమాఖ్య అకౌంటెంట్ ఎస్.నిర్మలాదేవి 40 మంది వీవోఏలు 70 మంది వాలంటీర్స్, మండల సమాఖ్య అధ్యక్షురాలు డి.దేరీసా, కార్యదర్శి బి.కళ్యాణి తదితరులు హాజరయ్యారు.

# ఆలయాల్లో ప్రత్యేక పూజలు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా శనివారం మండలంలోని పలు శివాలయాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని పార్వతీపరమేశ్వరాలయంతోపాటు మండలంలోని గండిపాళెం, యర్రబల్లిగడ్డ, లింగాలదొన, గుడినరవ, అప్పసముద్రం, జి.అయ్యావారిపల్లి, ఆర్లపడియ తదితర గ్రామాల్లోని శివాలయాల్లో అర్చకులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకొన్నారు.

# విద్యా ఉల్లాస్ శిక్షణా కార్యక్రమం

**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలంలో కూటమి ప్రభుత్వం నిర్దేశించిన ఆదేశాలు మేరకు మండల పరిధిలోని పొదుపు గ్రూపులో యందు గ్రామ ద్వారా వివోఏలు శిక్షణా తరగతుల గురించి నిర్వహించడం జరిగింది మండల ఏపిఎం మురళీకృష్ణ సీసీలు, ఏపీఎం చంద్రశేఖర్ ఈ యొక్క నిరక్షరాస్యత గురించి పొదుపు గ్రూపులో ఉన్నటువంటి సభ్యులందరికీ కూడా శిక్షణ ఇవ్వాలని ఎవరు కూడా వేలిముద్ర వేసే పరిస్థితి ఉండకూడదని అందరు కూడా సంతకాలు పెట్టే విధంగా తయారు చేయాలని మండల ఏపీఎం చంద్రశేఖర్ సీసీలను ఆదేశించారు.

## దాతృత్వం చాటుకున్న పూర్వ విద్యార్థులు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గండిపాళెం గ్రామంలో అద్దె భవనాల్లో కొనసాగుత చిన్న మెయిన్ ప్రాథమిక పాఠశాలకు శనివారం పూర్వ విద్యార్థులు ప్రధానోపాధ్యాయురాలు షేక్ షాహీదాఅక్తర్ కు అద్దె నగదు చెల్లించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. పాఠశాల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు అద్దె భవనంలో పాఠశాలను కొనసాగిస్తున్నారు. ఎంఈవో షేక్ మస్తాన్వలి సూచన మేరకు పూర్వ విద్యార్థి రెడ్డిబత్తిన ఉమాసాయిరాం. వారి మిత్రబృందం అద్దె భవనానికి ప్రతినెలా రూ.3వేల నగదును తాము అందజేస్తామని ముందుకొచ్చారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు వారి అభినందించారు. ప్రభుత్వం త్వరితగతిన స్పందించి పాఠశాలకు నూతన భవనాలు మంజూరు చేయాలని వారు కోరారు.

## వీవోఏలకు ఉల్లాస్ పై శిక్షణ

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక స్త్రీశక్తి భవనంలో శనివారం వీవోఏలకు ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపీడీవో అప్పాజీ, ఎంఈవో శ్రీనివాసులు మాట్లాడుతూ.. పొదుపు సంఘాల్లో ఉండే నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. మండలంలో రాబోయే ఆరు నెలల కాలంలో 331 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. అందుకు సంబంధించి గుర్తించిన 20 మంది వీవోఏలు, 13 మంది వలంటీర్లకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేయడం జరుగుతుంద న్నారు. కార్యక్రమంలో ఏపీఎం ఖాజారంతుల్లా, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

## పేకాట స్థావరాలపై మెరుపు దాడులు



**దగదర్తి, మేజర్‌న్యూస్ :** దగదర్తి మండలంలోని పెదపుతేడు, ఉప్పలపాడు గ్రామాల మధ్యలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో దాడులు నిర్వహించి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 12,210 నగదుని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జంపానికుమార్ తెలిపారు. మండలంలో పేకాట కోడి పందాలు లాంటి అసాం ఘిక కార్యక్రమాలు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్లు పెంచాలి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు పెంచాలని ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు సూచించారు. శనివారం మండలంలోని వెంకట్రావుపల్లి ప్రాథమికోన్నత, గంగిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. వెంకట్రావుపల్లి పాఠశాల ఆవరణలో పెంచుతున్న కిచెన్ గార్డెన్‌ను పరిశీలించి ఉపాధ్యాయులను అభినందించారు. అవకాశం ఉన్న ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్స్ పెంచాలన్నారు. అపార్ ఐడీలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. మనబడి-మన భవిష్యత్తు నిధులు విడుదల కాగానే వెం టనే పనులు పూర్తి చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం, రిజిస్టర్లు పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బలరాం, జ్యోతి, జమీర్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# ఆత్మకూరులో ఘనంగా దీపావళి పండుగ వేడుకలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో శుక్రవారం దీపావళి పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. దీపావళి అంటేనే పోటాపోటీగా బాణాసంచా కాల్చడమే అనే విషయం అందరికీ తెల్సిందే. వర్షం లేకుండా వాతావరణం సహకరించడంతో యువత, మహిళలు, చిన్నారులు అత్యంత కోలాహలంగా టపాసులు కాల్చుతూ కేరింతలతో పండుగను ఆనందోత్సాహాలమధ్య జరుపుకున్నారు. పట్టణ శివార్లలో టపాసులదుకాణాలు ఏర్పాటుచేయగా అక్కడ అన్నిరకాల బాణాసంచా విక్రయించగా జనాలు గుమికూడి అన్నింటిని కొనుగోలు చేసి ఎలాంటి ఆంక్షలు లేకుండానే సంతోషంగా కాల్చసాగారు. కాగా ఈదపా తిధి, నక్షత్రంలను బట్టి ఒకేరోజు మధ్యాహ్నాం వరకు నరకచతుర్ధశి, మధ్యాహ్నాం నుండి దీపావళి జరుపుకున్నారు. ప్రతి ఏటా రెండు రోజుల కార్యక్రమం కాగా ఈదపా ఒక్కరోజుకే పరిమితమైంది. ఇక ఇళ్ళలో తలంటుస్నానాలు, నూతన దుస్తులు, పండి



వంటలు గతంలోలాగానే యధావిధిగా తయారు చేసుకున్నారు. నరకచత్తుర్ధశి, దీపావళి రెండు పండుగలను ఒకేరోజు శుక్రవారం జరుపుకోవాల్సి రావడంతో వీధులవెంబడి ఇళ్ళ ముంగిట పోటీపోటీగా జనాలు బాణాసంచా మాత్రం అధికంగా కాల్చి పండుగను ఆనందంగా జరుపుకున్నారు. ఆత్మకూరు పట్టణంలో, మండలంలోని గ్రామాల్లో అందరూ అత్యంత కోలాహలంగా ఆనందోత్సాహాలతో దీపావళి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ళలో, ముంగిట మహిళలు దీపాలు వరుసలుగా వెలిగించి పండుగను జరుపుకోవడంతోపాటు ప్రత్యేక పూజలు కూడా చేశారు. యువత, చిన్నారులు ఉత్సాహంగా టాపాకాయలు, తారాజువ్వలు కాల్చుకుంటూ కేరింతలతో ఆనందోత్సా హాలమధ్య దీపావళి సంబరాలను జరుపుకున్నారు.

## జగనన్న కాలనీల్లో భారీగా అక్రమాలు : ఎమ్మెల్యే



**మనుబోలు, మేజర్‌న్యూస్ :** మండలం మడమనూరులో జగనన్న కాలనీ లేఅవుట్‌ను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ.. మడమనూరులో జగనన్న కాలనీ పేరుతో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో 162 మందికి పట్టాలిచ్చారని, లబ్ధిదారుల్లో ఎక్కువ శాతం మంది అనర్హులే ఉన్నారని, పక్కనున్న మట్టితో లేఅవుట్‌ను చదరం చేసి, లెవలింగ్‌కు ఎక్కడి నుంచో మట్టి తోలినట్టు చూపించి బిల్లులు చేసుకున్నారన్నారు. మూడేళ్లుగా జగనన్న లేడు.. కాలనీ లేదు.. ఇల్లు లేదు.. వాకిలి లేదు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జగనన్న కాలనీల పేరుతో ఇష్టారాజ్యంగా దోచుకున్నారన్నారు. జిల్లాలో జరుగుతున్న విజిలెన్స్ విచారణలో ఇప్పటికే రూ.120 కోట్ల అవినీతి వెలుగులోకి వచ్చింది. నాణ్యత విషయంలోనూ పరిశీలన జరిపితే మరో రూ.150 కోట్ల అవినీతి బయటపడుతుందని అంచనా వేస్తున్నారు. నాలుగు కాలాల పాటు పేదలు ఉండాల్సిన ఇళ్లలో ఇంత భారీ అవినీతి చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. పేద ప్రజలకు ద్రోహం చేయడంతోనే ఈరోజు 11 సీట్లకు పరిమితమై అనుభవిస్తున్నారు.

# రైతుల భాగస్వామ్యంతో సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు







- వైసీపీ పాలనలో పనులు చేయకుండానే బిల్లులు చేసుకున్న పెద్దమనుషులు
- సర్వేపల్లిలోని సాగునీటి ప్రాజెక్టులపై పగబట్టిన కాకాణి
- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** రైతుల భాగస్వామ్యంతో సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు ప్రారంభించామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు మండలం సూరాయపాళెం, తాటిపర్తి వద్ద కనుపూరు కాలువలో పూడికతీత పనులను శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ఐదేళ్ల తర్వాత మళ్లీ పారుదల కాలువల్లో పనులు ప్రారంభమయ్యాయని, జిల్లా వ్యాప్తంగా రూ.27 కోట్లతో ఓ అండ్ ఎం పనులు చేపట్టారు.. సర్వేపల్లి నియోజకవర్గంలోనూ రూ.9కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయని, వైసీపీ ఐదేళ్ల పాలనలో ఓ అండ్ ఎం పనుల పేరుతో ఎక్కడా పార పెట్టకుండానే రూ.150 కోట్లకు పైగా బిల్లులు చేసుకున్నారు కానీ ఏ పని కూడా పూర్తి చేయలేదన్నారు. ఇప్పుడు రూ.9 కోట్లతోనే దాదాపు నియోజకవర్గంలోని అన్ని సాగునీటి వ్యవస్థలను బాగు చేస్తున్నామని, ఒక్కో కోటికి 20 పనులను చేపడుతుంటే.. వైసీపీ పాలనలో మాత్రం ప్యాకేజీలుగా మార్చుకుని తినేశారన్నారు. ఏ ఊరికి ఆ ఊరులో రైతులనే పనులు చేసుకోవాలని ప్రోత్సహిస్తున్నామని, గతంలో ఏ ఏ హెడ్డు కింద ఏ పనిని చూపి బిల్లులు చేసుకున్నారో రైతులతో పాటు ఎవరికీ తెలియదన్నారు. ఈ రోజు ఏ ఊరికి వెళ్లినా రైతులే భాగస్వాములై కోలాహల వాతావరణంలో పనులు చేసుకుంటున్నారన్నారు. రైతుల పర్యవేక్షణలో ఎంతో పారదర్శకంగా పనులు జరుగుతున్నాయని, వైసీపీ ప్రభుత్వంలో కాకాణి గోవర్ధన్ రెడ్డి సర్వేపల్లిలోని సాగునీటి ప్రాజెక్టులను భ్రష్టుపట్టించాడన్నారు. కండలేరు ఎడమకాలువకు ఐదేళ్లు కరెంటు బిల్లు కట్టకుండా ప్రాజెక్టును మూలనపెట్టాడు. సోమశిల దక్షిణ కాలువ పెండింగ్ పనులను అడ్డుకున్నారని, కమీషన్లు ఇవ్వలేదని దేగపూడి- బండేపల్లి కాలువ పనులు ఆపేశారని, కాకాణి చేసిందేమైనా ఉందంటే.. గ్రావెల్, మట్టి, ఇసుక, క్వార్ట్జ్ అక్రమంగా తవ్వుకోవడం.. టోలుగేట్లు పెట్టి కలెక్షన్లు చేసుకోవడమే లక్ష్యంగా ఉన్నారన్నారు.






# ప్రతి ఒక్కరి మదిలో చెదరని జ్ఞాపకం గౌతమ్





- మాజీ ఎంపీ మేకపాటి
- బ్రాహ్మణపల్లిలో జయంతి వేడుకలు
- భారీగా హాజరైన వైసీపీ శ్రేణులు

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** ప్రజాక్షేత్రంలో ప్రజలకు అందించిన సేవలతో ప్రతి నాయకుడు వారికి గుర్తిండిపోతారని, అయితే మేకపాటి గౌతమ్ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుని ప్రతి ఒక్కరి ప్రేమాభిమానాలకు పాత్రుడై అందరి మదిలో చెదరని జ్ఞాపకంగా నిలిచిపోయారని నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. ఆయన శనివారం దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని స్వగ్రామమైన మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని మేకపాటి నివాసంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల నుంచే కాక జిల్లా నలుమూలల నుంచి వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మేకపాటి అభిమానులు పాల్గొని గౌతమ్‌రెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డిలు కేక్ కట్ చేసి కార్యకర్తలకు, అభిమానులకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా కార్యకర్తలు జోహార్ గౌతమన్న అంటూ నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని, ప్రజల అభిమానాన్ని చూరగొన్న ఆయన మరుపురాని నేతగా నిలిచిపోయారన్నారు. రాజకీయాల్లో హుందాగా నిలిచిన ఆయన రాజమోహన్ రెడ్డికి ధీటుగా గౌతమ్‌రెడ్డి ఉండేవారన్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు. రానున్న రోజుల్లో గౌతమ్‌రెడ్డి ఆశయాల కోసం అహర్నిశలు కృషి చేస్తామని, ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన అభివృద్ధికి తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు దివంగత మంత్రి గౌతమ్ రెడ్డితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బొర్రా వెంకట సుబ్బారెడ్డి గంగవరపు శ్రీనివాసులు నాయుడు సిద్ధం రెడ్డి మోహన్ రెడ్డి ముట్టుకొందు లక్ష్మీరెడ్డి తదితర నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# దాతలు సహాయంతో నిత్యాన్నదాన నిలయం

## కార్తికంలో వెల్లివిరుస్తున్న ఆధ్యాత్మికత



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని శివాలయ ప్రాంగణంలోని అయ్యప్ప పీఠంలో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది. ఎంతో నియమ నిష్టలతో మాలధారణ చేసే స్వాములకు, దీక్షపరులకు అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో నేటి (శనివారం) నుంచి డిసెంబరు 1వ తేది వరకు దాతల సహకారంతో ఉచితంగా భిక్ష అందిస్తూ తమ ఔదార్యాన్ని చాటుతున్నారు. మాల ధరించిన వారు ఎక్కడిప డితే అక్కడ భిక్ష(భోజనం) స్వీకరించరాదు. ఎంతో పవిత్రమైన వాతావరణంలో ప్రత్యేకంగా తయారు చేసిన వంటకాలనే భుజించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో కొందరు స్వాములు పనుల్లో పడి సకాలంలో భిక్ష చేయలేని పరిస్థితులను గమనించిన పొదలకూరు అయ్యప్ప సేవా సమాజం నిర్వాహకులు ఈ కార్తిక మాసం పూర్తి అయ్యే వరకు (30రోజులు) పాటు ప్రతి రోజూ మధ్యాహ్నం అన్నదానం చేస్తున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన అయ్యప్ప స్వాములు, భవానీలు, శివ, గోవింద, తదితర మాలధారణ చేసిన వారు సుమారు 200 మంది నుంచి 250మంది వరకూ ప్రతిరోజు భిక్ష స్వీకరిస్తున్నారు. వీరికి ఆలయ అధికారులు, మండల ప్రజలు, భక్తులు సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. శనివారం నిత్యాన్నదాన కార్యక్రమానికి ఉభయకర్తలుగా అడపాల మస్తాన్ రెడ్డి, ఐతా రవి, జనకల శ్రీనివాసులు, ఇండ్ల.రవి వ్యవహరించారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవా సమాజం గౌరవ అధ్యక్షులు శివాడి పరంధామి రెడ్డి, ముత్తుకృష్ణ, వీరేపల్లి శ్రీనివాసులు అధ్యక్షులు మొలబంటి శేఖర్, ఉపాధ్యక్షులు, సెక్రటరీ చొప్పా వెంకటేశ్వర్లు, కోటపాటి కృష్ణమ నాయుడు, ట్రెజరర్ అడపాల మస్తాన్‌రెడ్డి మాట్లాడుతూ.. కార్తిక మాసాన్ని పురస్కరించుకొని గత ఏడాది మొదలు, దీక్షా దారులకు మధ్యాహ్నం అన్న ప్రసాద అందించడం జరుగుతుందన్నారు. రాబోవు రోజుల్లో కార్యక్రమాన్ని మండలం పాటు నిర్వహించేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమానికి విరాళాలు అందిస్తున్న దాతలకు, ఉభయ కర్తలు పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐతా రవివర్మ, చిరంజీవులు, కోమల వెంకట్, గోగుల మహేష్‌లు పాల్గొన్నారు.

# ఏఆర్ ఎస్ఐ ఇమామ్ సాహెబ్‌ను సన్మానించిన ఎస్పీ కృష్ణ కాంత్



**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ చేస్తున్న ఏఆర్ ఎస్ఐ ఇమామ్ సాహెబ్‌ని జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ ఘనంగా సన్మానించారు. పదవి వీరమణ పొందిన ఏఆర్ ఎస్ఐని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ శాలువ, పూలమాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేసి, పోలీసుశాఖకు వారు అందించిన సేవలను కొనియాడారు. శేష జీవితం మంచి ఆరోగ్యంతో, ఆనందంగా గడపాలన్నారు. సుధీర్ఘకాలం పోలీసుశాఖలో పని చేసి పదవి విరమణ పొందడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రులను జాగ్రత్తగా, ఓపికతో బాగా చూసుకోండి. కుటుంబాలతో సంతోషంగా గడపాలని, పదవివీరమణ పొందిన తర్వాత ఏమైనా సమస్యలుంటే నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు. ఘనంగా 'ఆత్మీయ వీడ్కోలు' పలకడం, సత్కరించడం నా జీవితంలో ఎన్నటికీ మరువలేమని ఎస్పీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సౌజన్య, వెంకటేశ్వర రావు, చంద్రమౌళి, రాజారావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ బి.శ్రీనివాసరెడ్డి, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు మద్దిపాటి ప్రసాద్, నజీర్ బాషా పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
రిపోర్టర్స్ కావలెను
తెలుగు పత్రికా రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దిన పత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకుల కావలెను.
కావలసిన సెంటర్లు
నెల్లూరు జిల్లాలోని అల్లూరు, దగదర్తి, దుత్తలూరు, కొండాపురం, చేజర్ల, మనుబోలు, కొడవలూరు, బుచ్చి, కోవూరులలో విలేకర్లు కావలెను.
మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.
సూర్య కార్యాలయం, మిలిటరీ కాలనీ, రోడ్ నెం.1,
LIC & CID ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు.
సెల్: 9000 118811, 9966 49 71 49

# రూరల్‌లో విద్యా ఉల్లాస్ శిక్షణా కార్యక్రమం




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి వి.శైలేంద్ర కుమార్ అధ్యక్షతన వెలుగు కార్యాలయంలో వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో విద్య ఉల్లాస్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 15 సంవత్సరాలకు మించి 60 సంవత్సరాల వయసు వరకు పొదుపు సంఘాలలో సభ్యులుగా వున్న నిరక్షరాస్యులను గుర్తించి, వారికి ఆరు నెలల పాటు వయోజన విద్య పథకం క్రింద చదవడం, రాయడం నేర్పించడం జరుగుతుందన్నారు. నెల్లూరు రూరల్ మండలంలో 18 గ్రామ పంచాయతీలకు సంబంధించి నిరక్షరాస్యులకు 43 మంది విద్యా వాలంటీర్ల ద్వారా రోజుకు రెండు గంటలు చదువు చెప్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీ, వెలుగు సీసీలు, వివోఓలు తదితరులు హాజరయ్యారు.

# సాయిబాబా మందిరంలో అయ్యప్పలకు భిక్ష

- కార్యక్రమాన్ని ప్రారంభించిన మెట్టా విష్ణువర్ధన్ రెడ్డి



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కార్తీక మాసంలో అయ్యప్ప భక్తులకు మధ్యాహ్నం వేళ బిక్ష ఏర్పాట్లు చేసే ప్రక్రియను తాళ్లపూడి సాయిబాబా మందిరం ధర్మకర్త మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి శనివారం మందిరం వద్ద ప్రారంభించారు. కార్తీక మాసం ప్రారంభం నుంచి చివరి రోజు వరకు ఎంత మంది భక్తుల కైనా బిక్ష ఏర్పాట్లు చేశే అంశానికి ఆయన సంసిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో మందిరం నందు ప్రారంభించిన బిక్ష కార్యక్రమానికి అయ్యప్ప భక్తులు, శివమాల, భవాని మాల ధరించిన భక్తులు కూడా భిక్ష తీసుకున్నారు. నియమ నిష్టలతో తయారుచేసిన ఆహారాన్ని భక్తులకు అందించారు. సేవకులుగా మాజీ జెడ్పిటిసి నెల్లూరు ప్రసాదు, రాగాల వెంకటేశ్వర్లు, సుధీర్, హరి, గండవరం సూరి, శ్రీధర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, మరి కొంతమంది గ్రామస్తులు సహకారం అందించారు. ఈ సందర్భంగా ధర్మకర్త మాట్లాడారు. దైవ సంకల్పంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.